

పనులు త్వరగా పూర్తి చేయాలి

జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జెడ్‌పి నుంచి విడుదల చేసిన నిధులతో చేపట్టిన పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆదేశించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలోఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల పంచాయతీ రాజ్ ఇంజినీర్ అధికారులతో జెడ్‌పి నుంచి విడుదల చేసిన పనుల పురోగతిపై ఆమె బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంజూరు చేసిన పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ కె.భీమేశ్వర్, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

కేన్సర్‌కు 'ఎన్‌టిఆర్ వైద్యసేవ'లో కష్టాలు..!

కొత్త నిబంధనలు తెరపైకి తేవడంతో రోగుల అవస్థలు

కీమోల అప్రూవల్ విషయంలో నానాయాతన


ఒకే విడత కీమోకు రెండు సార్లు అప్రూవల్ అట

పలు కీమోలకు ఎన్‌టిఆర్ వైద్యసేవలో వర్తించని పరిస్థితి

ఆర్థిక భారం భరించలేక దిక్కుతోచని స్థితిలో సామాన్య కుటుంబాలు

జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న కేన్సర్ రోగులు

వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కేన్సర్ రోగులకు సరైన చికిత్స అందించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. కేన్సర్ వైద్యానికి ఎన్‌టిఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ)లో అనేక కొత్త నిబంధనలు తెరపైకి తెచ్చి రోగులను ముప్పతిప్పలు పెడుతోంది. కేన్సర్ రోగులకు అందించే పలు కీమోలు ఎన్‌టిఆర్ వైద్యసేవలో లేకపోవడంతో సామాన్య కుటుంబాలకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఆర్థిక భారం భరించలేక రోగుల కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇటీవల కాలంలో కేన్సర్ రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షల్లో పెద్ద ఎత్తున అనుమానిత కేసులు బయటపడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రతి రెండు లక్షల మందికీ ఒక్కశాతం కేన్సర్ అనుమానితులు ఉన్నట్లు తెలుస్తోంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా కేన్సర్ కబలించేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. ఓరల్, బెస్ట్ కేన్సర్‌లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. కేన్సర్ వచ్చిన రోగులకు చికిత్స అతిపెద్ద సవాల్‌గా మారింది. కేన్సర్ చికిత్స ఎన్‌టిఆర్ వైద్యసేవలో ఉందని చెబుతున్నప్పటికీ అంతంతమాత్రం అన్నట్లుగా తయారైంది. దీంతో కేన్సర్ రోగులకు వైద్యం చేయించలేక సామాన్య కుటుంబాలు పడుతున్న అవస్థలు వర్ణణాతీతంగా మారుతున్నాయి. కేన్సర్ రోగం నిర్ధారణకు బయాప్సీ పరీక్ష తప్పనిసరిగా చేయాలి. దీనికి రూ.ఏడు వేల వరకూ అవుతుంది. రోగ నిర్ధారణ అయిన తర్వాత ఎంత వరకూ వ్యాప్తి చెందిందో తెలుసుకోవాలంటూ పెట్ స్కాన్ రూ.23 వేలు పెట్టి చేయించాలి. రోగం నిర్ధారణకే దాదాపు రూ.30 వేలకు పైగా ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఇవేమీ ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్‌లో ఉండడం లేదు. కేన్సర్ రోగులకు అందించే కీమోల పరిస్థితి సైతం ఇదేవిధంగా తయారైంది. కీమోలను కోడ్‌లు ప్రాతిపదికన పిలుస్తారు. కొన్ని కోడ్‌లు ఎన్‌టిఆర్ వైద్యసేవలో లేకపోవడంతో రోగుల కుటుంబాలకు ఏంచేయాలో అర్థంకాకుండా పోతోంది. కీమోలు సైతం ఎన్‌టిఆర్ వైద్యసేవలో లేకపోవడం అత్యంత దారుణమని చెప్పొచ్చు. కీమోలకు సొమ్ములు చెల్లించి చేయించుకోవాలంటే సామాన్యులకు అసాధ్యమనే చెప్పొచ్చు. దీంతో కేన్సర్ రోగులు బెంగతో కుచించుకుపోతున్న పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ఎన్‌టిఆర్ వైద్య సేవలో కీమోల అప్రూవల్ విషయంలో కొత్త నిబంధనలు తెరపైకి తెచ్చి రోగులను నానా ఇబ్బంది పెడుతున్న పరిస్థితి నెలకొంది.

ఒకే కీమోకు రెండుసార్లు అప్రూవులా..

కేన్సర్ తీవ్రతను బట్టి వైద్యులు కీమోలను నిర్ణయిస్తారు. ఎంతమోదులో ఎక్కించాలి. కీమోలో ఏ మందులు వాడాలో వైద్యులు నిర్ణయించి ముందుకు సాగుతారు. ఒక్కోసారి రెండు రకాల మందులు ఒకే కీమోలో రోగికి అందిస్తారు. రెండు నెలల క్రితం వరకూ ఇలాంటి కీమోలకు ఒకేసారి ఎన్‌టిఆర్ వైద్యసేవ ట్రస్టు నుంచి అనుమతి పొందితే సరిపోయేది. ఇప్పుడు నిబంధనలు మార్చేసి ఒక మెడిసిన్ ఎక్కించిన తర్వాత మళ్లీ డిశ్చార్జ్ చేసి, మరో మెడిసిన్‌కు అప్రూవల్ పెట్టాలి. అప్రూవల్ వచ్చిన తర్వాత ఆ మెడిసిన్ ఎక్కించి మరోసారి డిశ్చార్జ్ చేయాలి. ఒకే కీమోకు రెండు సార్లు అప్రూవల్, రెండు సార్లు డిశ్చార్జులు చేయిస్తున్నారు. దీంతో రోగులు పడుతున్న బాధలు వర్ణాతీతంగా మారుతున్నాయి. అదనంగా రోజులు కేటాయించడంతోపాటు, డిశ్చార్జ్ కోసం పలుమార్లు తిరగాల్సి వస్తోంది. ఎన్‌టిఆర్ వైద్యసేవలో ఉన్న అధికారులు ఏవిధంగా ఆలోచిస్తున్నారో అర్థం కావడం లేదు. టెక్నాలజీ గురించి ప్రభుత్వ పెద్దలు పదేపదే వళ్లిస్తున్నారు. కీమోలో అప్రూవల్ విషయంలో ఒకేసారి అనుమతి పొందే టెక్నాలజీని పక్కకు పెట్టి రోగులను ఇబ్బంది పెట్టడం ఏంటో ఏ ఒక్కరికీ అర్థంకావడం లేదు. కేన్సర్ రోగులు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వైద్యం అందించే ప్రక్రియ సులువుగా మార్చాల్సి ఉంది. అలాకాకుండా వైద్యం అందే ప్రక్రియను మరింత కష్టతరంగా మార్చేస్తున్న పరిస్థితి నెలకొంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంది. లేకపోతే కేన్సర్ రోగుల కష్టాలు మరింత పెరగనున్నాయి.



మాట్లాడుతున్న సంక్షేమ పథకాల అమలు పర్యవేక్షణ ఏలూరు జిల్లా ప్రత్యేక అధికారి ఆమ్రపాలి

అభివృద్ధి, సంక్షేమంలో జిల్లాను అగ్రగామిగా నిలపాలి

వ్యవసాయం, అనుబంధ రంగాలు, పర్యాటకం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

అధికారులతో సంక్షేమ పథకాల అమలు పర్యవేక్షణ జిల్లా ప్రత్యేక అధికారి కె.ఆమ్రపాలి సమీక్ష

ప్రజాశక్తి - ఏలూరు

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల్లో ఏలూరు జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపేందుకు అధికారులు కృషి చేయాలని సంక్షేమ పథకాల అమలు పర్యవేక్షణ ఏలూరు జిల్లా ప్రత్యేక అధికారి కె.ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని గౌతమీ సమావేశం హాల్లో బుధవారం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి జిల్లాలో అమలు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యాలయాల అమలును వివిధ శాఖల అధికారులతో జిల్లా ప్రత్యేక అధికారి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమ్రపాలి మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల అధికారులు తమకు కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత సమయంలోగా పూర్తిచేసి, ఏలూరు జిల్లాను రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు లభించేలా ప్రగతి పథంలో నిలపాలన్నారు. వ్యవసాయ ప్రధానమైన ఏలూరు జిల్లాలో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించేందుకు రైతులకు ప్రభుత్వం అందించే చేయూతపై అవగాహన కలిగించి, మరింత విస్తీర్ణంలో సాగుచేసేలా చూడాలన్నారు. ఉద్యానవన పంటలకు, ఆక్వా పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ చట్టం కింద కూలీలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కల్పించనున్న పనిదినాలు, చేపట్టాల్సిన పనులపై రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, జిల్లాలో సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్టు, పాపికొండలు, కొల్లేరు ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 2.65 లక్షల మంది పేదలకు ప్రతినెలా 112.50 కోట్ల రూపాయలు సామాజిక పెన్షన్లుగా అందిస్తున్నామని, మొదటిరోజే దాదాపు 98 శాతం వరకూ పెన్షన్ల పంపిణీ పూర్తిచేస్తున్నామని తెలిపారు. ఏలూరు జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళలు చేసే వివిధ రకాల ఉత్పత్తులకు బ్రాండ్ ఇమేజ్ కల్పించి, ఆన్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు చేసిన ఉత్పత్తులు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు 2.50 లక్షల ఉత్పత్తులు ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలు జరిగి గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించారని, 50 ఉత్పత్తులు అమ్మకాలతో ఏలూరు జిల్లా మూడో స్థానంలో నిలిచిందని తెలిపారు. జిల్లాలో వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ప్రగతి సాగిస్తున్నామని, ఉద్యానవన పంటల్లో ఆయిల్ పామ్ అధిక విస్తీర్ణంలో సాగవుతోందన్నారు. అలాగే కోకో పంటను ఆయిల్ పామ్, కొబ్బరి తోటలో అంతర పంటగా 35 వేలు సాగవుతోందని తెలిపారు. మిరియాలు, యాలకులు, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో వంటి పంటలకు అనుకూల పరిస్థితులు కల్పించి జిల్లాలో ఔత్సాహిక రైతులు సాగుచేస్తున్నారన్నారు. జిల్లాలో 31 జాబ్ మేళాలు నిర్వహించి 1,657 మంది యువతకు వివిధ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. సమావేశంలో డిఎఫ్ఒ శుభం, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, జిల్లా పరిషత్ సిఇఒ కె.భీమేశ్వరరావు, డిఆర్‌డిఎ, డ్వామా పీడీ విజయరాజు, కెవి.సుబ్బారావు, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీలత, వ్యవసాయాధికారి హబీబ్ బాషా, పశు సంవర్ధక శాఖ జెడి గోవిందరాజులు పాల్గొన్నారు.

సర్దుబాటు పేరుతో.. ఊరు బడికి ఎసరు..!

ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు

విద్యా కమిటీలను బుజ్జగించాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి

ప్రజాశక్తి - భీమడోలు

నూతన విద్యా విధానంలో సంస్కరణల కారణంగా విద్యా వ్యవస్థలో పలు మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఈ మేరకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రతిపాదనలను వ్యతిరేకించే పాఠశాల విద్యా కమిటీలను బుజ్జగించాలని ఉన్నతాధికారులు పాఠశాలల ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే సిద్ధం చేసిన ప్రతిపాదన మేరకు మండలంలోని దుద్దేపూడి, సదాశివపురం, సాయంపాలెం, పూళ్ల నెంబర్-3 ప్రాథమిక పాఠశాలలు మూతపడనున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం సదరు పాఠశాలలో చేరేందుకు ఆసక్తి కనబర్చే విద్యార్థులు ఉంటే పాఠశాలలను పున్నప్రారంభిస్తామని అధికారులు సర్దుబాటు మాటలు చెబుతున్నారు. ఇదే క్రమంలో హైస్కూల్ స్థాయిలో నిర్వహించేందుకు అనువైన వాతావరణం గల అన్నేవారిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా మార్చేందుకు రంగం సిద్ధం చేశారు. ప్రస్తుతం ఆ పాఠశాలలో 130 మంది వరకూ విద్యార్థులు ఉన్నారు. ఆరుగురు వరకూ బిఇడి ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. హైస్కూల్ నిర్వహణకు అవసరమైన నాలుగు భవనాలు అదే గ్రామంలో దగ్గర ప్రాంతాల్లో అందుబాటులో ఉన్నాయి. వీటిని సైతం పరిగణనలోకి తీసుకోకుండా పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా మారుస్తున్నారు. విద్యాశాఖ నిబంధనల మేరకు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఇతర ప్రాంతాల్లో ఆరో తరగతిలో చేరేందుకు జాతీయ రహదారిని దాటడం, రైల్వే ట్రాక్ ఉండడం వంటి అడ్డంకులు ఉండరాదు. అయితే అన్నేవారిగూడెం పాఠశాల విషయమై ఈ విషయాన్ని అధికారులు పరిగణనలోకి తీసుకోలేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

ఉపాధ్యాయుల విషయానికొస్తే మండలంలో 85 మంది వరకూ ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. తాజా నిబంధనల మేరకు అన్నేవారిగూడెం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఐదుగురు బిఇడిలు ఇతర ప్రాంతాలకు బదిలీ, ప్రాథమిక పాఠశాలలకు చెందిన సుమారు ఆరుగురు ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేస్తున్న కారణంగా మిగులు ఉపాధ్యాయులుగా వారిని చూపుతున్నారు. మండలంలో కేవలం 74 మంది మాత్రమే ఉపాధ్యాయులు అవసరమని అధికారులు చెబుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్య మరింతగా తగ్గితే ఉపాధ్యాయ పోస్టులకు మరింత కోత ఏర్పడే అవకాశం ఉందంటున్నారు. మండలంలో పని చేస్తున్న ఎనిమిది ప్రాథమిక పాఠశాలలను ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చనున్నారు. ప్రస్తుతం ఆ పాఠశాలలో చదువుతున్న మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసే మోడల్ పాఠశాలలకు సర్దుబాటు చేయనున్నారు. దీనివల్ల పాఠశాల నిర్వహణకు కనీసంగా అవసరమైన 60 మంది విద్యార్థులు అందుబాటులో ఉంటారని, వీరికి పూర్తిస్థాయిలో విద్యాబోధన చేసేందుకు ఉపాధ్యాయులు ఉంటారని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు మండలంలోని భీమడోలు నెంబర్-1, 4, పొలసానిపల్లి నెం-3, గుండుగొలను నెం-1, 2, పూళ్ల నెం-1, ఎంఎంపురం-1, కురెళ్లగూడెం నెం-1 పాఠశాలలు మోడల్ స్కూళ్లగా మారనున్నాయి. ఇక మండలంలోని 17 ఇతర పాఠశాలల్లో 60 మంది విద్యార్థులు ఉన్న నేపథ్యంలో ఒకటి నుంచి ఐదో తరగతి నిర్వహించేందుకు బేసిక్ ప్రయిమరీ స్కూళ్లగా మార్చారు. మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఒకటి, రెండు తరగతులు మాత్రమే నిర్వహించే తొమ్మిది స్కూళ్లను ఫౌండేషన్ పాఠశాలలుగా మార్చనున్నారు. అంబరుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని వడ్లపట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో కేవలం 30 మంది మాత్రమే విద్యార్థులు ఉన్నందున దాన్ని కూడా బేసిక్ పాఠశాలగా మార్చే ప్రతిపాదనలు ఉన్నాయి. అక్కడ మిగిలిన విద్యార్థులు దూరప్రాంతమైన భీమడోలుకు రావాల్సి ఉంటుంది. ఇదే క్రమంలో పూళ్ల నెం.1 పాఠశాలలో పూళ్ల నెం-2, 3 పాఠశాలలు విలీనం కానున్నాయి. ఇక కొత్త అంబరుపేట, పాత అంబరుపేట ఆవాస ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఒకటిగా చేసే ప్రయత్నానికి పాఠశాల విద్యా కమిటీలు అంగీకారం తెలపలేదు. వీరికి నచ్చజెప్పేందుకు ఉపాధ్యాయులు తంటాలు పడుతున్నారు. ఇదే జరిగితే ఒక ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు మరో పాఠశాలకు వెళ్లేందుకు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉంటుంది. దారిలోని చెరువులు, ఇతరాలు దాటి వెళ్లేందుకు వారు ఇబ్బందులు ఎదుర్కొంటారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక గుండుగొలను నెం-1 పాఠశాలలో నెం-3, (గతంలో సిఎస్ఐ పాత ఎయిడెడ్ పాఠశాల) ప్రస్తుతం ఎంపిపి పాఠశాలను విలీనం చేస్తున్నారు. ఇక అదే ప్రాంతంలోని సిబిసిఎన్‌సి ఎయిడెడ్ పాఠశాల నిర్వహణ బాధ్యతలను ఎయిడెడ్ పాఠశాల మండల పరిషత్ యాజమాన్యానికి అప్పగించలేదు. అలాగని చెప్పి ఎయిడెడ్ పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయడం లేదు. పాఠశాల నిర్వహణను మాత్రం మండలాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇక పొలసానిపల్లిలో నెం-2ను ప్రాథమిక పాఠశాల నెం.1 పాఠశాలలో విలీనం కానుంది. వీటిపై అధికారులు మాట్లాడుతూ ఇవన్నీ ప్రతిపాదనలు మాత్రమేనని తుదిరూపం వచ్చేసరికి మార్పులు, సర్దుబాట్లు జరుగుతాయని అంటున్నారు.

ఉపాధి కూలీల వేతనాలు విడుదల చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ



వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. నూజివీడులోని సిపిఎం కార్యాలయంలో బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం మేడిపల్లి హోలీ మేరీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలు వేతనాలు లేక నానా అవస్థలు పడుతున్నారని విమర్శించారు. జనవరి 15 నుండి నేటికీ వేతనాలు విడుదల చేయకపోవడంతో కూలీల కుటుంబాలు అప్పుల పాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి 15 రోజులకోసారి వేతనాలు ఇవ్వాలని, చట్టంలో ఉన్న దాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. కూలీలకు పని ప్రదేశాల్లో పనిముట్లు, తాగునీరు మజ్జిగ, టెంట్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. పని చేసిన ప్రతి కూలీకీ పే స్లిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనిలో రాజకీయ నాయకుల జోక్యం దుర్మార్గపు చర్య అని విమర్శించారు. జిల్లాలో కొన్ని మండలాల్లో, గ్రామాల్లో రాజకీయ నాయకులు చెబితేనే పనులు చూపించడం జరుగుతోందన్నారు. ఇలాంటి విధానాన్ని అమలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. ఏప్రిల్ ఒకటి నుండి 30వ తేదీ వరకూ జిల్లాలో ఉన్న అన్ని మండలాల్లో, గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశాల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పర్యటించడం జరుగుతుందని తెలిపారు. పర్యటన సందర్భంగా కూలీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా పి.లక్ష్మయ్య, సత్తు కోటేశ్వరరావు, అనిల్, అర్జున్‌రావు పాల్గొన్నారు.

పూలే, అంబేద్కర్ కృషిని ప్రచారం చేయాలి

వారి జయంతుల సందర్భంగా 13న పలు కార్యక్రమాలు



కార్యక్రమాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి - ఏలూరు

నేటి సమాజంలో పూలే, అంబేద్కర్లు చేసిన కృషిని విస్తృతంగా ప్రచారం చేయడం కోసం ఏలూరులో ఉన్న వివిధ సంఘాలు చేపట్టిన కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని బహుజన ఆఫీసర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. జ్యోతిరావు పూలే 198వ జయంతి, బిఆర్.అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే కార్యక్రమ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వాహక కమిటీలు, ప్రతినిధులు ఏర్పాటు చేశారు. పవర్‌పేటలోని అన్నే భవనంలో ఏర్పాటుచేసిన బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, బహుజన ఆఫీసర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, కార్యక్రమ కో-కన్వీనర్లు జి.రాంబాబు, జి.నీలిమ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బాలోత్సవం కమిటీ ప్రతినిధులు కె.శ్రావణకుమారి, కె.జనని, దేవరకొండ లలిత, ఎం.సాయిసిద్ధార్థ, డి.విజ్ఞాన్ హాజరయ్యారు. దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ 13న సర్ సిఆర్.రెడ్డి బిఇడి కాలేజీలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు జరిగే కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, మానవతా, యుటిఎఫ్, బిఒఇఎఫ్, కెవిపిఎస్ సంయుక్తంగా విద్యార్థులు, పెద్దలందరితో పూలే గురించి, అంబేద్కర్ గురించి మాట్లాడించే కార్యక్రమం సభ నిర్వహిస్తున్నామన్నారు. నిర్వాహక కమిటీ కో-కన్వీనర్ జి.రాంబాబు (రిటైర్డ్ లోకో పైలెట్) మాట్లాడుతూ 13వ తేదీ కార్యక్రమం వివరాలు తెలిపారు. పూలే, అంబేద్కర్‌ల ఆలోచనా విధానం, నేటి ప్రాధాన్యత గురించి మాట్లాడించనున్నట్లు తెలిపారు. మాట్లాడిన వారిలో ప్రతి కేటగిరీలో బెస్ట్ మూడు చొప్పున బహుమతులుగా మెమెంటో, రాజ్యాంగం సంకలనం, ప్రశంసాపత్రం అందిస్తామని, పాల్గొన్న ప్రతిఒక్కరికీ ప్రశంసాపత్రం ఇస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు తమ పేర్లు ఈ నెల పదో తేదీ సాయంత్రంలోగా 9441975257, 9515027023, 9490098559లలో ఏదో ఒక నెంబర్‌కు వాట్సాప్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు. కో-కన్వీనర్ జి.నీలిమ (టీచర్ వ్యాఖ్యాత) మాట్లాడుతూ 13వ తేదీ మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు గాయనీ గాయకులచే సావిత్రిబాయి, పూలే, అంబేద్కర్ గురించిన ప్రబోధాత్మక సందేశాత్మక పాటలు కళా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు ఎస్.కస్తూరిరావ్ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు సర్‌సిఆర్.రెడ్డి బిఇడి కాలేజీ, మీటింగ్ హాలులో జరిగే సదస్సుకు ముఖ్యఅతిథిగా పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, సెట్ వెల్ సిఇఒ కెఎస్.ప్రభాకర్, రిటైర్డ్ ఆచార్యులు డి.అబ్రహం, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి.వెంకటేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. దేవరకొండ లలిత మాట్లాడుతూ పూలే అంబేద్కర్ గురించి అందరు అర్థం చేసుకునే వారికి నివాళులర్పించే విధంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా పూలే, అంబేద్కర్ జయంతి సమ్మేళనం ఫ్లెక్సీ బ్రోచర్లను ఆవిష్కరించారు.

సిపిఎం 24వ అఖిల భారత మహాసభకు రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



సిపిఎం 24వ అఖిల భారత మహాసభ ఈ నెల రెండో తేదీ నుంచి ఆరో తేదీ వరకు ఐదు రోజుల పాటు తమిళనాడు రాష్ట్రంలోని మధురై పట్టణంలో జరుగుతున్నాయని, జిల్లా నుంచి తాను హాజరవుతున్నానని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. మధురై వెళ్లే ముందుగా ఆయన ఈ మహాసభపై ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ఉన్న రాజకీయ విధానాన్ని సమీక్షించుకునేందుకు, రానున్న మూడళ్ల కాలంలో నిర్ణయించుకోవాల్సిన రాజకీయ విధానం గురించి, స్వతంత్రంగా సిపిఎం ఎదుగుదల గురించి ఈ మహాసభలో చర్చించి కర్తవ్యాలు, కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తుందని, ఈ మహాసభకు దేశ వ్యాప్తంగా 880 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని, రాష్ట్రం నుంచి 25 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ మహాసభకు దేశ వ్యాపితంగా ఉండే అతిరథ మహారథులైన సిపిఎం నాయకులు పాల్గొంటున్నారని, అందులో తాను భాగస్వామ్యం అయినందుకు ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్ సందర్శన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్‌ఎసి) ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ బుధవారం స్థానిక ప్రభుత్వ ప్రజా వైద్యశాల ప్రాంగణంలోని వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రతి రెండు నెలలకు వన్ స్టాప్ సెంటర్ పనితీరును సమీక్షించాల్సి ఉందని, అందులో భాగంగా బుధవారం ఈ వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించినట్లు తెలిపారు. ఈ వన్ స్టాప్ సెంటర్ బాధిత మహిళలకు, బాలలకు కౌన్సెలింగ్ నిర్వహించి వారికి ఆసరా కల్పిస్తుందని, కుటుంబ వివాదాల పరిష్కారానికి విశేషంగా కృషి చేస్తుందని, ఈ వివాహాల సమస్యల్లో అవసరమైన వారికి మధ్యవర్తిత్వం ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి సమస్యను పరిష్కరించడాం లేదా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేసి కేసులు వాదించనున్నట్లు తెలిపారు.

గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో పేదలకు నిర్మిస్తున్న గృహాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం జిల్లాలోని గృహ నిర్మాణ శాఖాధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో పేదల గృహ నిర్మాణ ప్రగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రానున్న మే, 31వ తేదీ నాటికి జిల్లా వ్యాప్తంగా 13,525 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యానికి ఇప్పటివరకు 6,832 ఇళ్ల నిర్మాణం మాత్రమే పూర్తయిందని, ప్రస్తుత వేసవిలో ఇళ్ల నిర్మాణానికి అనుకూలమైన వాతావరణం ఉంటుందని, ఇంజినీరింగ్ సిబ్బంది వారికి కేటాయించిన లక్ష్యాలను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులకు చెందిన లబ్ధిదారులకు అందించే అదనపు ఆర్థిక సహాయంపై, ప్రభుత్వం ఉచితంగా అందించే ఇసుక, రాయితీపై అందించే సిమెంట్, నిర్మాణ సామగ్రి, తదితర విషయాలపై లబ్ధిదారులకు అవగాహన కలిగించి, ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతమయ్యేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. లక్ష్యసాధనలో వెనుకబడి ఉన్న లింగపాలెం, అగిరిపల్లి, చింతలపూడి, ఏలూరు, నూజివీడు, మండవల్లి, జంగారెడ్డిగూడెం, తదితర మండలాల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిర్దేశించిన సమయంలోగా లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.సత్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ ఇఇలు, డిఇలు, ఎఇలు, గ్రామ, వార్డ్ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నిర్వాసితుల, రైతుల పక్షాన కాంగ్రెస్ పోరాటం

కాంగ్రెస్ ప్రాజెక్టు అధ్యయన కమిటీ వైస్ ఛైర్మన్ కిరణ్ కుమార్ రెడ్డి

పోలవరం : పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం, నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి, రైతాంగం పక్షాన కాంగ్రెస్ పోరాడుతుందని ఆ పార్టీ ప్రాజెక్టు అధ్యయన కమిటీ వైస్ ఛైర్మన్ కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పోలవరం ప్రాజెక్టులో పలు నిర్మాణ ప్రాంతాలను బుధవారం పరిశీలించిన అధ్యయన బృందం పోలవరం ప్రాజెక్టు ముఖద్వారం వద్ద జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడింది. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును రాష్ట్రానికి జీవనాడిగా గుర్తించిన వ్యక్తి కీర్తిశేషులు వైఎస్.రాజశేఖరరెడ్డి అన్నారు. ఆయన హయాంలో 2004 నుంచి 2009 మధ్య ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులన్నీ సాధించారన్నారు. జాతీయ ప్రాజెక్టుగా గుర్తిస్తే కేంద్రం 60 శాతం నిధులిస్తే రాష్ట్రం 40 శాతం నిధులు భరించాల్సి ఉంటుందని, కాని వంద శాతం నిధులిచ్చేలా విభజన చట్టంలో పెట్టింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. పోలవరం ప్రాజెక్టు కనిష్ట నీటి నిల్వ స్థాయికి తీసుకొచ్చారంటే ప్రపంచంలో దీనికంటే దౌర్భాగ్య స్థితి వేరొకటి లేదన్నారు. మన నాయకుల తీరును, వైఖరిని రాష్ట్ర రైతాంగం గుర్తించాలన్నారు. అధ్యయన కమిటీ మెంబర్ రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ గతంలో షర్మిలా రెడ్డి నిర్వాసితుల గ్రామాల్లో పర్యటించారని, నేడు షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకే తాము వచ్చామన్నారు. స్టీల్ ప్లాంటు ప్రయివేటీకరణను అడ్డుకున్న ఘనత వైఎస్.షర్మిలారెడ్డిదేనన్నారు. తొలుత అధ్యయన కమిటీ బృందాన్ని కాంగ్రెస్ మండల నాయకులు శాలువాలతో సన్మానించారు.

ఆమ్రపాలిని కలిసిన ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలును పర్యవేక్షించేందుకు జిల్లా ప్రత్యేకాధికారిణిగా నియమితులై మొట్ట మొదటిసారిగా ఏలూరుకు విచ్చేసిన అమ్రపాలిని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు బుధవారం కలెక్టరేట్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో ఉద్యోగులంతా సంపూర్ణ సహకారం అందిస్తారని తెలిపారు. కార్యదర్శి నెరసు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం కింద ప్రభుత్వంచే అందించిన ఉచిత నోట్ పుస్తకాలను, పాఠ్య పుస్తకాలను ప్రిన్సిపల్ కుసుమ, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, సర్పంచి వెంకాయమ్మ చేతుల మీదుగా ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా కరాటం సాయి, ప్రిన్సిపల్ కుసుమ మాట్లాడుతూ విద్యారంగంలో అభివృద్ధికరమైన మార్పులు రానున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం విద్యారంగంలో పెను మార్పులు తీసుకురావడం కోసం ఈ విద్యా సంవత్సరంలో ప్రయోగాత్మకంగా ఏప్రిల్ నెల నుంచి తరగతులను ప్రారంభించినట్లు తెలిపారు. బుట్టాయగూడెం పంచాయతీ సర్పంచి వెంకాయమ్మ మాట్లాడుతూ పూర్వం తాము చదువుకునే రోజుల్లో కూలి పనికి వెళ్లి వచ్చిన డబ్బులను దాచుకుని పుస్తకాలను, బట్టలను కొనుక్కునేవాళ్లమన్నారు.

సమావేశం నిర్వహణకు స్థలం చూపాలి

తహశీల్దార్‌కు భవన నిర్మాణ కార్మికుల వినతి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

సమావేశం నిర్వహించుకునేందుకు స్థలం చూపాలని కోరుతూ ద్వారకా శ్రీనివాస భవన నిర్మాణ కార్మిక సంఘం, మండలంలోని తాపీ మేస్త్రీల యూనియన్ వారు తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనియన్ పెట్టుకుని 16 ఏళ్లు అయిందని, 150 మంది సభ్యులు ఉన్నారని, సమావేశం నిర్వహించుకునేందుకు తగు ప్రదేశం లేదని చెప్పారు. దీనిపై గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజును కలిశామని, ఆయన ద్వారకాతిరుమల గ్రామంలోని పది సెంట్ల స్థలం చూసి ఇవ్వమని తహశీల్దార్‌కు చెప్పారని తెలిపారు. దీని నిమిత్తం తహశీల్దార్‌కు బుధవారం వినతిపత్రం అందించినట్లు చెప్పారు. ఎక్కడైనా స్థలం చూసి ఇస్తామని భవన నిర్మాణ కార్మికులకు తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ బండారు శివాజీ, దాసరి శ్రీనివాస్, ఆది కృష్ణ, బొంతు సింహాచలం, ఎన్.నాగమణిందర్రావు, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.


బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నుంచి కాంతంపాలెం, వెంకటాపురం, వెంకటాద్రిగూడెం మీదుగా గణిజర్లకు బస్సు సౌకర్యం కల్పించాలని సిపిఐ సీనియర్ నాయకులు మామిళ్లపల్లి వసంతరావు కోరారు. చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌ను సిపిఐ మండల కమిటీ సభ్యులు బుధవారం కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా చింతలపూడి నుంచి కాంతంపాలెం, వెంకటాపురం, వెంకటాద్రిగూడెం మీదుగా గణిజర్లకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆయనకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ గణిజర్ల గ్రామంలో ఉన్న విద్యార్థులు అటు రాఘవాపురం, సత్తుపల్లి వెళ్లాలన్నా, ఇటు చింతలపూడి రావాలన్నా బస్సు సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరితోపాటు గ్రామంలో కూరగాయలు పండించిన చిన్న, సన్నకారు రైతులు వారి ఉత్పత్తులను అమ్ముకోవడానికి సత్తుపల్లి, చింతలపూడి రావాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గణిజర్లకు బస్సు సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి తోర్లపాటి బాబు, పట్టణ కమిటీ సభ్యులు తాడిగడప మాణిక్యాలరావు పాల్గొన్నారు.

నూతన పెన్షన్లు పంపిణీ

ప్రజాశక్తి - కలిదిండి


పింఛన్లు పంపిణీ చేస్తున్న నేతలు

మండలంలోని వెంకటాపురం పంచాయతీ కార్యాలయం వద్ద నూతనంగా మంజూరైన ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు సర్పంచి గూడవల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని పోలవరం ఎంఎల్ఎ బాలరాజు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలంలోని తాటియాకులగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన రీ సర్వే ప్రాజెక్ట్ గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో నిర్వహించిన రీ సర్వేలో తప్పులు దొర్లయని, వాటిని సరిచేసేలా రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని పలువురు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వనమా రాంబాబు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఉదయ్ భాస్కర్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ పెద్దిరాజు, సర్వేయర్ రెడ్డి, విఆర్ఒ పాషా, పంచాయతీ కార్యదర్శి వీరలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అంజుమన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు సిటీ :గత సంవత్సర కాలంగా అంజుమన్ సంస్థలో జరుగుతున్న అవకతవకలను గుర్తించడంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు అంజుమన్ నూతన వర్కింగ్ కమిటీ కార్యవర్గ సభ్యుడు రియాజ్ అలీ ఖాన్ తెలిపారు. ఏలూరులోని వన్‌టౌన్‌లో ఉన్న అంజుమన్ కళ్యాణ మండపంలో బుధవారం నూతన కార్యవర్గ సభ్యులు పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రియాజ్ అలీ ఖాన్ మాట్లాడుతూ అంజుమన్ అంటే పేదలకు, బడుగు బలహీన తరగతులకు న్యాయం చేసే ఒక కమిటీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గ ప్రెసిడెంట్ జబివుల్లా సాహెబ్, సెక్రటరీ అహ్మదుల్లా షరీఫ్ సాహెబ్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

చెల్లని చెక్కు కేసులో జైలు, జరిమానా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

బాకీ తీర్చని నిమిత్తం ఇచ్చిన చెక్కు బ్యాంకులో చెల్లని నేరానికి బాపులపాడు మండలం సేరినరసన్నపాలేనికి చెందిన బల్ల సత్యనారాయణకు ఆరు నెలల జైలు, 12 లక్షలు జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. 2020 జులై ఆరో తేదీన మండలంలోని సీతారామపురానికి చెందిన కన్నె కంటి సాంబశివరావు సత్యనారాయణకు రూ.12.44 లక్షలు నగదు అప్పుగా ఇచ్చారు. కొంతకాలం తర్వాత బాకీ చెల్లించమని సాంబశివరావు సత్యనారాయణను కోరగా 2021 జులై ఐదో తేదీన రూ.పది లక్షలకు చెక్కు ఇచ్చారు. ఆ చెక్కు బ్యాంకులో వేయగా ఖాతాలో నగదు లేదని బ్యాంకు తిప్పి పంపారు. తరువాత సాంబశివరావు కోర్టులో కేసు వేయగా విచారణ అనంతరం న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎలుకల మందు తిని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొమ్మినంపాడు శివారు జానకిగూడెం గ్రామానికి చెందిన పిచ్చేటి కొండయ్య (42) భార్య సంవత్సరం క్రితం సౌదీ కెళ్లింది. అప్పటినుండి తన ఇద్దరు పిల్లలతో అత్తగారి ఊరైన మండలంలోని వడాలి గ్రామంలో ఉంటూ ఆటో తోలుకొని జీవిస్తున్నాడు. కొండయ్య ప్రతిరోజు మద్యం తాగి అర్ధరాత్రి ఇంటికి వెళ్లడంతో అతని ఇద్దరు పిల్లలు మందు తాగి ఇంటికి లేటుగా వస్తున్నావని అడిగారు. దీంతో కొండయ్య మనస్తాపానికి గురై తాగిన మైకంలో గత మూడు రోజుల క్రితం ఎలుకల మందు తిన్నాడు. దీంతో పిల్లలు తండ్రిని చికిత్స నిమిత్తం గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడు అన్నయ్య బాపూజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నేడు పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని పరింపూడి గ్రామపంచాయతీలో గురువారం పలు అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి. జలజీవన్ మిషన్‌లో భాగంగా తాగునీటి ట్యాంక్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫీస్ దగ్గర ఉదయం ప్రారంభం కానుంది. అదే విధంగా, రేపల్లెవాడలో భవన కార్మికుల భవనాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిడిఒ కార్యాలయం వెనకాల కొత్తగా నిర్మించిన పంచాయతీ కార్యాలయం ప్రారంభోత్సవం మరో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు, ఆంధ్రప్రదేశ్ ట్రైకర్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్ హాజరు కానున్నారు.

ఘనంగా జాతీయ నడక దినోత్సవం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని గొల్లపల్లి శ్రీ అన్నేరామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నడక దినోత్సవం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.రాధికారాణి మాట్లాడుతూ విద్యార్థులందరూ ప్రతి రోజూ 30 నిమిషాలు నడవాలన్నారు. చురుకైన నడక సమయంలో మన గుండె ఎక్కువ రక్తాన్ని పంప్ చేస్తుందన్నారు. ఆరోగ్య కరమైన జీవితానికి నడక అవసరమన్నారు. ఊబకాయంతో ఉన్నవారు నడక వల్ల కొంత తగ్గవచ్చున్నారు. వక్తృత్వ పోటీల్లో ప్రథమ బహుమతి రెడ్డి రాజేష్, ద్వితీయ బహుమతి శివచరణ్, తృతీయ బహుమతి పల్లవి, చతుర్థ బహుమతి ప్రవీణ్ పొందారు. బహుమతులను ఇంగ్లీషు ఉపాధ్యాయులు సాకా రవి స్పాన్సర్ చేశారు. .

పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - భీమడోలు

ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త, అంగన్వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌ఛార్జి సిడిపిఒ షెహనాజ్ బేగం తెలిపారు. దీనిలో భాగంగా కాకర్లమిల్లిలో అంగన్వాడీ కార్యకర్త, భీమడోలు మండల పరిధిలోని ఆరు, ఉంగుటూరు మండల పరిధిలోని నాలుగు, నిడమర్రు మండల పరిధిలోని మూడు అంగన్వాడీ కేంద్ర సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తికర దరఖాస్తుదారులు నిబంధనల మేరకు పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 17వ తేదీలోగా సిడిపిఒ కార్యాలయానికి సమర్పించాలని కోరారు.

భూసార పరీక్షా కేంద్రాభివృద్ధికి ప్రణాళిక

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణ పరిధిలోని అగ్రికల్చరల్ మార్కెట్ యార్డ్ ఆవరణలో ఉన్న భూసార పరీక్ష కేంద్రం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్ తెలిపారు. నూజివీడులో ఆయన బుధవారం మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ 2025 మే మాసానికి భూసార పరీక్ష కేంద్రం అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.32 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలోని రైతులు వారి వారి సాగు భూములకు సంబంధించి భూ నమూనాలు పరీక్ష కేంద్రానికి తీసుకురావాలన్నారు. భూసార పరీక్షల అనంతరం మాత్రమే అవసరమైన ఎరువులను వినియోగించి భూసార అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. విచ్చలవిడిగా ఎరువులు, పురుగుమందుల వినియోగంతో భూసారం కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

పశువుల కోసం నీటి తొట్టెల నిర్మాణం

ప్రజాశక్తి - ముసునూరు

వేసవిలో నీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా పశువుల కోసం నీటి తొట్టెల నిర్మాణాలు చేపట్టనున్నట్లు సర్పంచి కొండేటి బాబి విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో ఉపాధి హామీ చట్టం ద్వారా పశువులు, మూగజీవాలు, పశుపక్షాది జీవాల కోసం నీటి తొట్టెలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ ఆ పథకం ద్వారా వినియోగించుకోవాలని ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి తోట శ్రీనివాసరావు, కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు తులిమెలి రంగారావు, నక్క యోహాను, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటిజం పట్ల అవగాహన అవసరం

ఆగిరిపల్లి :ఆటిజం వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆగిరిపల్లి ఎంఇఒ కె.ఆనంద్‌కుమార్ ఆటిజం లక్షణాలు ఉన్నవారు భవిత కేంద్రంలో ప్రత్యేక ఉపాధ్యాయులు ఇస్తున్న శిక్షణ ద్వారా తమ జీవితాలను మెరుగు పర్చుకోవాలని చెప్పారు. అంతర్జాతీయ ఆటిజం దినోత్సవం సందర్భంగా పురవీధుల్లో బుధవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు కె.ఝాన్సీరాణి, బి.రజిని, ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి, మెయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.విజయదుర్గా, వికలాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విగ్రహాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి -ముదినేపల్లి

ముదినేపల్లి సంత మార్కెట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సర్దార్ గౌతు లచ్చన్న, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాలను బుధవారం రాత్రి ఆవిష్కరించారు. గౌతు లచ్చన్న విగ్రహ దాత శ్రీహరిపురం గ్రామ సర్పంచి పరసా విశ్వేశ్వరరావు ఆవిష్కరించగా, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని విగ్రహ దాత బొర్రా శేషుబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మచిలీపట్నం మాజీ ఎంపీ కె.నారాయణరావు హాజరు కాగా బిసి నాయకులు బొర్రా చలమయ్య, పరసా ఏడుకొండలు, పోసిన పాండురంగారావు, పెద్ద సంఖ్యలో బిసి నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని సిద్ధార్థ నగర్, పోలసానపల్లి గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎం.చెన్న రాఘవేంద్రనాథ్ తెలిపారు. నూజివీడులో ఆయన బుధవారం మాట్లాడుతూ ఈ నెల మూడో తేదీ నుంచి ఐదు వరకు పొలసానిపల్లి యుపి స్కూల్‌లో, 8 నుంచి 11వ తేదీ వరకు సిద్ధార్థ నగర్ యూపి స్కూల్‌లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూజివీడు యూనిట్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా వి.గోవిందరావు, ఎంకెవిఎల్ఎన్ సోమయాజులు, 11 మంది కార్యవర్గం బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ హాలులో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వి.గోవిందరావు, ఎంకెవిఎల్ఎన్ సోమయాజులను ఎల్ఐసి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, సిఐటియు నూజివీడు పట్టణ కమిటీ అభినందించారు.

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న మంత్రి పార్థసారధి

నూజివీడు నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా 24 గంటలు అందుబాటులో ఉండటంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద పాలేరులా పని చేస్తానని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మండల కేంద్రమైన ఆగిరిపల్లి ఎంపిడిఒ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(ప్రజాదర్బార్) కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించి వాటినే తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలో పలు సమస్యలకు సంబంధించి 113 అర్జీలు రాగా వాటిలో అధికంగా రెవెన్యూ, సివిల్, రైస్‌కార్డులు, భూసమస్యలకు సంబంధించిన అర్జీలు అధికంగా వచ్చాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి సిహెచ్.లక్ష్మీవిక్టర్‌బాబు, తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్, ఎంపిడిఒ బి.ఆనంద్‌బాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతలపూడి : నియోజకవర్గంలో ప్రజలు వారి సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి ఆర్‌అండ్‌బి బంగ్లా కార్యాలయం వద్ద బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రజలు సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులు సంప్రదించి పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యలకే పెద్దపీట వేస్తున్నామని, ఎవరికి ఏ సమస్య వచ్చినా నిరభ్యంతరంగా వారి సమస్యలను తెలపవచ్చని, తక్షణమే చర్యలకు ఆదేశాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమస్యలు పరిష్కరించడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ ప్రజా దర్బార్‌కు అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి సమస్యలపై వినతలు అందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటి విద్యార్థులకు హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు

నూజివీడు టౌన్: ఆర్‌జియుకెటి నూజివీడు విద్యార్థినులకు హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు నిర్వహించినట్లు క్యాంపస్ రిజిస్ట్రార్, డైరెక్టర్ అమరేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆర్‌జియుకెటి క్లినిక్ నూజివీడు క్యాంపస్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా అమరేంద్ర మాట్లాడుతూ ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్ విద్యార్థినులందరికి దశల వారిగా హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. హిమోగ్లోబిన్ లోపం ఉన్న విద్యార్థులకు రోజూ అందరితో పాటు అందించే పాలు, గుడ్లు మాత్రమే కాకుండా అదనంగా పాలు, గుడ్లు, ఆహార మెనూలో మార్పులు కూడా చేస్తామమని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణరావు, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ సీతాపతి, డాక్టర్ దుర్గాభవాని, గర్ల్స్ చీఫ్ వార్డెన్ డాక్టర్ గౌతమి, గర్ల్స్ అసోసియేట్ వార్డెన్ డాక్టర్ కలావతి, అసోసియేట్ డీన్ అకడమిక్స్ కె.రఘుకుమార్, ఆర్‌జియుకెటి క్లినిక్ సిబ్బంది, ఇతరులు పాల్గొన్నారు.

సర్వే కార్యక్రమాల సేవలను వినియోగించుకోవాలి


ప్రజాశక్తి - భీమడోలు

స్వయం సహాయక సంఘాల సభ్యులకు వార్షిక, జీవనోపాధుల ప్రణాళిక తయారుచేయడానికి ప్రస్తుతం పేదరిక నిర్మూలన సంస్థ చేపట్టిన సర్వే కార్యక్రమాలు సహకరిస్తాయని, వీటి సేవలను వినియోగించుకోవాలని వెలుగు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్(సంస్థాగత నిర్మాణం) విజయ కుమారి కోరారు. భీమడోలు వెలుగు కార్యాలయంలో ఎంపిక చేసిన ఎన్యూమరేటర్లకు సర్వే కార్యక్రమపు అవగాహనా సదస్సును నిర్వహిస్తున్నారు. రెండో రోజైన బుధవారం చేపట్టిన కార్యక్రమానికి వెలుగు భీమడోలు ఎపిఎం రత్నకుమారి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు విజయకుమారి, అనిత(జీవనోపాధులు), సహాయ ప్రాజెక్టు మేనేజర్(జీవనోపాధులు) వేణుగోపాల్ పాల్గొన్నారు. దీనికి 54 మంది ఎన్యూమరేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా మేనేజర్లు మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేల వల్ల స్వయం సహాయక సంఘాల పొదుపు, అప్పుల వివరాల సేకరణతో పాటు వచ్చే ఆర్థిక సంవత్సరం వారు చేపట్టే వ్యాపారాలు, జీవనోపాధులు, కుటుంబ అవసరాలకు ఎంత మేరకు రుణం అవసరమవుతుందో కచ్చితమైన లెక్కలు తెలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు భీమడోలు సిసిలు నిర్మల కుమారి, రేఖా రాణి, అకౌంటెంట్ సావిత్రి పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించండి

తహశీల్దార్‌కు రైతుల వినతి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల


వినతిపత్రం అందిస్తున్న రైతులు

భూ వివాదాల పరిష్కారం కోసం వైసిపి ప్రభుత్వం చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం రైతుల మధ్య వివాదాలు పెంచే విధంగా తయారైందని మండలంలోని గుండుగోలనుగుంట, వెంకటకృష్ణాపురం రైతులు అన్నారు. జిరాయితీ భూములు ప్రభుత్వ భూములుగా ఆన్‌లైన్‌లో నమోదై ఉన్నాయన్నారు. వారు బుధవారం తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. రెండు గ్రామాల్లో మళ్లీ సర్వే చేయించి భూములు సక్రమంగా అప్పగించాలని కోరారు. రైతుల పాసుపుస్తకాలల్లో కూడా ఇతరుల ఫొటోలు వచ్చాయని, విస్తీర్ణం కూడా హెచ్చుతగ్గులు ఉన్నాయని, ఈ సమస్యలను పరిష్కరించి రైతుల సమక్షంలో భూ సర్వే చేయించి తమ భూములు తమకు అప్పగించాలని కోరారు.

పేదల సొంతింటి కల సాకారానికి కృషి

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అర్హులైన పేదల సొంతింటి కల సాకారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి హామీ ఇచ్చారు. గత వైసిపి ప్రభుత్వంలో మంజూరైన ఇళ్ల నిర్మాణం కూడా పూర్తిచేసే బాధ్యత తనదేనంటూ స్పష్టం చేశారు. ఏలూరు ఎస్ఆర్ స్టేడియం సమీపంలోని ముస్లిం షాదీఖానాలో బుధవారం ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని టిడిపికి చెందిన డ్వాక్రా గ్రూపుల సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఆయనకు ఆత్మీయ స్వాగతం లభించింది. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలో టిడ్కో ఇళ్ల కోసం రూ.35 వేలు డిడిలు కట్టిన వారిలో 2,200 మందికి ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. మిగిలిన వారికి రూ.35 వేలను వెనక్కి ఇచ్చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లను కూడా పూర్తిచేసే బాధ్యతను తానే స్వీకరిస్తానన్నారు. ఈ సమావేశంలో ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, మెప్మా సిఎంఎం బి.ఝాన్సీరాణి, పిఒ బి.మహాలక్ష్మి, మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, కో – ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

కాకి లెక్కలు.. కుంటి సాకులు

పోలవరం ప్రశ్నార్థకం
సిపిఐ ప్రచార జాతాలో నేతలు

కుక్కునూరు:పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం విషయంలో కూటమి ప్రభుత్వం కుంటి సాకులు చెప్తూ.. కాకిలెక్కలు వేస్తూ జాప్యం చేస్తుందని, విభజన హామీల ప్రకారం కేంద్ర ప్రభుత్వం విధిగా ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా పూర్తి స్థాయిలో నిర్మించాలన్నారు. సిపిఐ ప్రచార జాతాలో భాగంగా బుధవారం కుక్కునూరు మండలంలో సీతారామనగరం, ఉప్పేరు, చీరవల్లి, కుక్కునూరు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మొదట ఇచ్చిన హామీ మేరకు 45.72 కాంటూరు ఎత్తులోనే నిర్మించాలని ఆమె డిమాండ్ చేశారు. ముంపు అంచనా వేసి నిర్వాసితులకు తగిన పరిహారం అందించాలని, పునరావాసం చూపించాలని కోరారు. అర్హులందరికీ ప్యాకేజీ ఇచ్చాకే పునరావాస కాలనీలకు తరలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజనుల పోడు భూములకు పట్టాలివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కుక్కునూరు మండల సమితి కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి, ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు కారం దారయ్య, సన్నేపల్లి సాయిబాబు, బాడిస రాము, ఏలూరు జిల్లా సమితి సభ్యులు ఐతా సురేష్‌బాబు పాల్గొన్నారు.

మేడేను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - వేలేరుపాడు

ఫ్రెండ్స్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మేడేను ఘనంగా నిర్వహించుకుందామని యూనియన్ ప్రెసిడెంట్ కురిమెళ్ల శ్రీను పిలుపునిచ్చారు. వేలేరుపాడులోని స్థానిక ఎన్‌టిఆర్‌గ్రౌండ్‌లో బుధవారం యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కురిమెళ్ల శ్రీను మాట్లాడుతూ ఫ్రెండ్స్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో 75 మంది సభ్యులతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతినెలా యూనియన్ మీటింగ్ నిర్వహించుకుంటున్నామని తెలిపారు. వచ్చే మే నెల సమావేశం మే ఒకటే తేదీన జెండా ఎగరవేసి ఆరోజునే సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాళ్ల సిరి సూరి, ఈగలపాటి శివ, బీరం అంజి, ఎస్‌కె.పాషా, రెడ్లం నాయుడు, మజ్జి శ్రీను, బల్లా మల్లేశ్వరరావు, జాకీర్, తదితర యూనియన్ సభ్యులు పాల్గొన్నారు..

మండలంలోని స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ఫ్రెండ్స్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సిఐటియు జిల్లా నాయకులు మడివి దుర్గారావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

శ్రీచైతన్యలో ఘనంగా స్పోర్ట్స్ మీట్

ఏలూరు సిటీ : ఏలూరు జోన్‌లోని వివిధ బ్రాంచీల్లో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో విజేతలైన విద్యార్థులకు డాక్టర్ బిఎస్.రావు మెమోరియల్ జోనల్ స్పోర్ట్స్ మీట్ పేరిట బుధవారం జోనల్ వైడ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఏలూరు జోన్ శ్రీ చైతన్య పాఠశాలలు ఆకివీడు, భీమడోలు, చింతలపూడి, ఏలూరు శాంతినగర్, బాలాజీ నగర్, విద్యానగర్, హనుమాన్ జంక్షన్, కైకలూరు, జంగారెడ్డిగూడెం, భీమవరం-1, భీమవరం-2, తదితర బ్రాంచిల నుంచి సుమారు 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ అంశాల్లో వారి సత్తా చాటారని శ్రీ చైతన్య విద్యాసంస్థల ఎజిఎం సుంకర పార్థసారధి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్న విద్యార్థుల వందన సమర్పణ మార్చ్ ఫాస్ట్‌ను స్వీకరించారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత, కీర్తిశేషులు డాక్టర్. బిఎస్.రావు చిత్రపటానికి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. జోనల్ స్పోర్ట్స్ మీట్-2025 క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏలూరు రీజనల్ ఇన్‌ఛార్జి సిహెచ్. ఉదయభాస్కర్ మాట్లాడారు. ఈ సభలో శ్రీచైతన్య విద్యాసంస్థల వివిధ రీజియన్ల ఇన్‌ఛార్జులు, సెంట్రల్ ఆఫీస్ టీమ్ ఫర్ స్పోర్ట్స్, ఎకడమిక్ కోఆర్డినేటర్లు, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - భీమడోలు

ప్రఖ్యాత పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమలకు భీమడోలు- ద్వారకాతిరుమల రాష్ట్రీయ రహదారిపై ప్రయాణించే యాత్రికుల సౌకర్యార్థం పొలసానిపల్లి కేంద్రంగా తాగునీరు, మజ్జిగ అందించేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన దాతల కృషి అభినందనీయమని సర్పంచి రహీమా బేగం హసేన తెలిపారు. అఖిల భారత స్థాయిలో వికలాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న సక్షమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పొలసానిపల్లిలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు భీమడోలు రామకృష్ణ, యు.పెద్దిరాజు, కనుమూరి బాపిరాజు, పారిశ్రామికవేత్త షేక్ హసేన, చలివేంద్రం నిర్వాహకులు, సక్షమ్ సభ్యులు ఉండ్రు బెంజిమెన్, జ్యోతిశ్రీ పాల్గొన్నారు.

పోలవరం :పోలవరం తహశీల్దారు కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని తహశీల్దార్ సాయిరాజు ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. తొలుత మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలో అన్ని పంచాయతీల గ్రామాల కూడళ్లలో అవసరాన్ని బట్టి చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

గురుకులాల్లో ప్రవేశానికి 6 వరకు గడువు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో 5,6,7,8 ఖాళీల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల ఆరో తేదీ వరకు గడువు పొడిగించినట్లు అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, ఏలూరు జిల్లా కన్వీనర్ డిఎస్‌బి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ మంగళగిరి వారిచే నిర్వహిస్తున్న అప్పలరాజుగూడెం (బాలురు), నాగిరెడ్డిగూడెం (బాలికలు), ముసునూరు (బాలికలు) పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 5,6,7,8 తరగతుల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశానికి దరఖాస్తులు ఈ నెల 6వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో %aprs, apcfss .in% చేసుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 8712625030 సంప్రదించాలని తెలిపారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ మొబైల్ క్యాంపులు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండల పరిధిలో ఈ నెల మూడో తేదీ నుంచి ఐదో తేదీ వరకు మూడు రోజులపాటు ప్రత్యేక ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పద్మావతి దేవి తెలిపారు. దీనిలో భాగంగా గుండుగొలను సచివాలయం యూనిట్ ఆధ్వర్యంలో ఆగడాలలంక సచివాలయం కేంద్రంగాను, పూళ్ల సచివాలయం యూనిట్ ఆధ్వర్యంలో పూళ్ల గ్రామ సచివాలయం-1, కేంద్రంగాను, భీమడోలు గ్రామ సచివాలయం యూనిట్ ఆధ్వర్యంలో భీమడోలు సచివాలయం-1 కేంద్రంగా క్యాంపుల నిర్వహణ నిర్ణీత తేదీల్లో ఉంటుందని ఎంపిడిఒ తెలిపారు.

రోడ్డు విస్తరణకు ఆదేశాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలు - ఉండి వెళ్లే రాష్ట్రీయ రహదారి మార్గంలో ఉంగుటూరు మండలం రాచూరు రోడ్డు వెడల్పు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు అధికారులను ఆదేశించారు. రాచూరు శివాలయం మలుపు దగ్గర ఇరుకు రోడ్డు ప్రమాదాలకు నిలయంగా ఉంది. ఈ నేపథ్యంలో రోడ్డు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించి రోడ్డు విస్తరణ చేయటంలో భాగంగా బుధవారం సాయంత్రం రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, ఆర్‌అండ్‌బి , రెవెన్యూ పలు శాఖల అధికారులతో కలిసి ఆ రోడ్డు పరిస్థితిని పరిశీలించారు. ఆక్రమణల తొలగింపు, రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

టిడిపి కార్యకర్తల సలహాలు, సూచనలు స్వీకరణ

ప్రజాశక్తి - భీమడోలు

టిడిపిని బలోపేతం చేయటంతో పాటు, కార్యకర్తలను చైతన్యపరిచేందుకు, సమస్యల పరిష్కారానికి పార్టీ అధిష్ఠానం పిలుపుమేరకు ప్రతి బుధవారం నియోజకవర్గ స్థాయిలో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తెలిపారు. ఈ మేరకు భీమడోలులోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తలు సమావేశాన్ని నిర్వహించారు. కార్యకర్తల సలహాలు, సూచనలు స్వీకరించడంతోపాటు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించేందుకు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ కార్యకర్తలు ఇచ్చిన వినతుల్లో స్థానికంగా పరిష్కారమయ్యే వినతులపై అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇతర సమస్యల పరిష్కారానికి తీర్మానం చేసి, వివరాలను పార్టీ రాష్ట్ర కార్యాలయానికి పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలోని పలువురు టిడిపి ప్రముఖులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.